క్లుప్తంగా

దర్గాలో ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందు తున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా మండలంలోని గువ్వమ్మ సందు కొండల్లో నాటుసారా స్థావరంపై గురువారం దాడులు చేసి 170 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 7 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ తెలిపారు. దాడుల్లో ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ ప్రతాప్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



ఆంధ్ర జట్టు క్రీడాకారులు

ఆదోని సెంట్రల్: ఈనెల 26, 27వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో జరగనున్న జాతీయస్థాయి డాడ్జ్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ జట్టు గురువారం బయలుదేరింది. ఈసందర్భంగా గురువారం క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ డాడ్జ్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంబిరెడ్డి, సెక్రటరీ సాబీర్‌అహ్మద్, క్రీడా దుస్తుల స్పాన్సర్ హసన్ బేగ్, వ్యాయమ ఉపాధ్యాయులు రామన్న, నరసింహరాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు సరిహద్దు రాళ్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు బీఎల్ నారాయణ, బతకన్న, గణేష్, రంగస్వామి, వీజీఆర్ కొండయ్య, కౌన్సిలర్ దయాసాగర్ కోరారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ కిష్టప్పకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు పెద్దయ్య, నాగరాజు, రంగన్న, టిప్పాల్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుల దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటం

పెద్దకడబూరు : కుల దురహంకార దాడులకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కేవీపీఎస్(కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) పోరాడుతోందని డీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల రామన్న అన్నారు. గురువారం కేవీపీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా మంచోది రామన్న, అధ్యక్షుడిగా బొగ్గుల అనిల్, కార్యదర్శి తలారి రాజు, కోశాధికారి యేసురాజు, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, నరసింహులు, అంథోని, పరమానందం, రవి, సుధాకర్, సహాయకార్యదర్శులుగా బాబు, దినాకర్, సిమెను, లాజరు, బెంజిమన్, ఆనందరాజుతో పాటు మరో 30మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న అంబేడ్కర్ నాటక ప్రదర్శన



నాటకంలోని ఓ సన్నివేశం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ఎయిర్ థియేటర్‌లో గురువారం రాత్రి కేవీపీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరానికి చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమికి చెందిన రంగస్థల నటులు ప్రదర్శించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం విశేషంగా ఆకట్టుకుంది. నాటక ప్రదర్శనకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సీపీఎం నాయకులు రామాంజినేయులు, గోవిందు, ఎంఆర్‌పీఎస్, దళిత సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నదికైరవాడిలో నీటి ఎద్దటి

- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్వో ప్లాంట్‌ను స్వాధీనం చేసుకున్న టీడీపీ నాయకులు
- నిర్వహణ గాలికొదిలేసిన వైనం
- 7 రోజుల క్రితం మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్
- రిపేరు చేయించకుండా చోద్యం చూస్తున్న అధికారులు, టీడీపీ నేతలు
- తాగునీటి కోసం మూడు గ్రామాల ప్రజల అవస్థలు





కొత్తకైరవాడిలో ట్యాంకర్ వద్ద తాగునీటి కోసం క్యూలో వేచి వున్న గ్రామస్తులు, నదికైరవాడిలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్న గ్రామస్తులు

నందవరం: గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చడానికి లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచి నీటి పథకాలు నేడు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో రక్షిత మంచినీటి పథకాలపై ఆధారపడుతున్న గ్రామీణ ప్రజలు తాగు, వాడుక నీటి కోసం అవస్థలు పడుతున్నారు. మండలంలోని నదికైరవాడి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వారం రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దటి నెలకొంది. అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మూడు గ్రామాలకు సరఫరా

నదికైరవాడి గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు ద్వారా కొత్తకైరవాడి, నదికైరవాడి, యానం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లే ఆర్వో ప్లాంట్‌ల నిర్వహణ చేపట్టేవారు. గతంలోను చెడిపోతే గుర్తైతే రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నేతలు దానిని స్వాధీనం చేసుకున్నారు. క్యానుకు రూ.5 చొప్పున వసూలు చేస్తున్నా నిర్వహణ మాత్రం పట్టించుకోవడంలేదు. గ్రామంలో దాదాపు 7 రోజుల క్రితం ఆర్వో ప్లాంటు పాడైపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అయితే మరమ్మతులు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో కొత్తకైరవాడి, నదికైరవాడి, యానం గ్రామస్తులు తాగునీటికి అల్లాడుతున్నారు.

నీటి కోసం సుదూర ప్రాంతాలకు..

గ్రామంలో బోరు ద్వారా నీరు వస్తున్నా ఆ నీరు ఉప్పుగా ఉండంతో తాగడానికి పనికిరావడం లేదు. అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు. పొలాల్లోని బోర్లు, పక్క కాలనీలకు వెళ్లి తాగునీటి తెచ్చుకోవాల్సి వస్తోందని, తాగునీటి కోసం బిందెలు పట్టుకొని పరుగులు తీయాలని గ్రామ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బిందె రూ.10

గ్రామంలో నీటి ఎద్దడి నెలకొనడంతో నందవరం నుంచి ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ట్యాంకర్ ద్వారా ఫిల్టర్ వాటర్ తెప్పించి వాటర్ క్యాన్‌కు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో గ్రామస్తులు డబ్బు చెల్లించి నీరు తీసుకోవాల్సి వస్తోంది. రూ.5 అందించే వాటర్‌ను రూ.10లు వసూలు చేయడమేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైనట్లు నా దృష్టికి ఈ రోజే(గురువారం) వచ్చింది. రెండు రోజుల్లో మరమ్మతులు చేయించి తాగునీటిని సరఫరా చేస్తాం. రిపేరికి సంబంధించి మిషనరీ సామన్లు పంచాయతీ అధికారులు తీసుకు వచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించి ఆర్వో ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు ఫిల్టర్ వాటర్ అందిస్తాం.

– మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, నందవరం



నదికైరవాడిలో మూత పడిన ఆర్వో ప్లాంటు

వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ

- మద్దతిచ్చిన వైఎస్సార్‌సీపీ, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, ప్రజా సంఘాల నాయకులు

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గురువారం వక్ఫ్ పరిరక్షణ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని దుల్హాపైల్వాన్ మసీదు నుంచి కంట్రోల్ రూం, భీమాస్ కూడలి మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ పార్టీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా చట్టం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తామన్నారు. సీపీఐ నాయకులు గౌస్ దేశాయ్, లక్ష్మన్న మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగానికి తూట్లు పొడించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ, ఎంఐఎం నాయకులు, సీపీఐ నాయకులు అజయ్‌బాబు, సురేందర్, ఖాజీ అల్తాఫ్ హుసేన్, పౌర హక్కుల సంఘం నాయకులు అల్లా బకాష్, న్యాయవాదులు నాసిర్, మన్సూర్‌అహ్మద్, హుసేన్‌సాని, సద్దాం హుసేన్, మైనార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: 60 ఏళ్లున్న మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ ఇచ్చి పంపాలని ప్రభుత్వం జీఓ ఇచ్చిన నేపథ్యంలో వారికి రూ.5లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యునియన్ నాయకుడు శివకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. నాయకులు వీరేష్, విజయేంద్ర, నరసింహులు, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న లేబర్ కోడ్లు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు ఆరోపించారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఈ- కేవైసీ పూర్తి చేయండి

పెద్దకడబూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డు దారుల ఈ-కేవైసీని ఈనెల 30లోపు పూర్తి చేయించాలని తహసీల్దారు గీతాప్రియదర్శిని సూచించారు. గురువారం డీలర్ల సమావేశం నిర్వహించారు. డీలర్లు తమ పరిధిలోని కార్డుదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు.

నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

ఆదోని అర్బన్: పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా పట్టణంలో శుక్రవారం చేపట్టే కొవ్వొత్తుల ప్రదర్శనకు తరలిరావాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, నాయకులు విట్టా రమేష్, భీమారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేయాలని కోరారు.

ప్రజల సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి

గోనెగండ్ల : ప్రజల సహకారంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థ సక్రమంగా పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. గ్రామాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలంటే ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగి పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పంచాయతీ కార్యదర్శి అనురాధ, నాయకులు మాణిక్యరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్స్ రజిత తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ, అంబేడ్కర్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ మణి మంజరి

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

కోసిగి: 10వ తరగతిలో స్టేట్ సిలబస్ 500 మార్కులు, సెంట్రల్ సిలబస్‌లో 420 మార్కులు పైన వచ్చిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ కోసిగి ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో ఆర్డీటీలో పనిచేస్తూ సంస్థలో మెంబర్ షిప్ కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలలోని పిల్లలు ప్రవేట్ స్కూల్‌లో చదివినా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా కోసిగిలో ఆర్డీటీ కార్యాలయం అప్లికేషన్‌ను సమర్పించాలి. మరిన్ని వివరాలకు కోసిగి ఆర్డీటీ కార్యాలయంలో సంప్రదించగలరని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



క్రైం మీటింగ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరురూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ స్థాయి క్రైం మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ మోసగాళ్లు ఎక్కువయ్యారని, వారి వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సెల్ ఫోన్లలో వచ్చే కొత్త నంబర్ల కాల్స్‌పై జాగ్రతగా ఉండాలని, మీ బ్యాంక్ అకౌంట్, సెల్‌కు వచ్చిన ఓటీపీలు చెప్పండి అని ఎవరైన కాల్స్‌చేస్తే స్పందించవద్దని సూచించారు. అలాగే మాదకద్రవ్యాలకు యువత బానిసలు కావద్దన్నారు. సమావేశంలో సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాల్మీకి అభ్యర్థులకు ఉచిత భోజన వసతి

ఎమ్మిగనూరుటౌన్: డీఎస్సీకి పట్టణంలో కోచింగ్ తీసుకునే వాల్మీకి, బోయ అభ్యర్థులకు ఉచిత భోజన వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంఘ నాయకులు ఉసేని, వెంకటేశ్వర్లు, నాగరాజు, తిమ్మారెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ కోచింగ్ తీసుకునే వాల్మీకి అభ్యర్థులు సెల్ నంబర్ 99667 96904, 99852 38841, 97057 05171లకు సంప్రదించి ఉచిత భోజన వసతి కోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘ నాయకులు రాఘవన్, రఘునాథ్, నారాయణ, శేఖర్, చిన్న తిమ్మన్న, నాగమద్దయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ జనార్దన్‌కు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్యకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో 15రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారు. రాజనగర్ వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంకుకు ప్రత్యేకంగా కరెంట్ లైన్ లేకపోవడం, దానికి తోడు కౌతాళంతో పాటు బాపురం గ్రామానికి కూడా ఒకే మోటర్ ఉండడంతో నీటి సమస్య తలెత్తుతోందన్నారు. మోటార్లు కాలిపోయాయని చెప్పి 15రోజుల నుంచి నీటి సరఫరా చేయకుండా ఉన్నారని తెలిపారు.


అమ్మ కష్టానికి ఫలితం



తల్లితో విజయనాథ్‌రెడ్డి

నందవరం : ఓ అమ్మ కష్టం తన కుమారుడిని ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా స్ఫూర్తినిచ్చింది. మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన కమతం విజయనాథ్ రెడ్డి ఆదోనిలోని అక్షర శ్రీ స్కూల్‌లో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో 593 మార్కులు సాధించాడు. విజయనాథ్ రెడ్డి చిన్నతనంలోనే తండ్రి వెంకట్రామిరెడ్డి మృతి చెందారు. గ్రామంలో తల్లి గిరిజ వ్యవసాయం చేస్తూ విజయనాథ్ రెడ్డిని చదివించింది. అమ్మ కష్టంతో చదవి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాడు. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ తీసుకుని ఏరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తానని విజయనాథ్‌రెడ్డి తెలిపాడు.

ఇంజినీర్ అవుతా



శేవంత్ ఆచారికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

నందవరం : పదో తరగతి ఫలితాల్లో ముగతి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కే. శేవంత్ ఆచారి 578 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి కే. బసవరాజు వెలుగు వీఓఏగా పని చేస్తూ, ఇంటి వద్ద చిన్న వ్యాపార దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యార్థి అమ్మ రాజేశ్వరి గృహిణి. వీరిద్దరూ కష్టపడి కుమారుడు శేవంత్ ఆచారిని చదివించారు. తల్లిదండ్రులు తనపై ఉంచిన నమ్మకంతో ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ తీసుకుని ట్రిపుల్‌ఐటీ చేసి ఇంజినీర్ అవుతానని శేవంత్ తెలిపాడు.

ముందస్తు అడ్మిషన్లతో ఫీజుల దోపిడీ

ఎమ్మిగనూరుటౌన్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు టార్గెట్లు పెట్టి యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఆ విద్యార్థి సంఘ నాయకులు మోహన్, రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి

ఆదోనిరూరల్: పట్టణంలోని ప్రత్యేక కారాగారాన్ని గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి తనిఖీ చేశారు. సబ్‌జైలులోని ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడడానికి వచ్చే వారికి కల్పించే సౌకర్యాలను పరిశీలించారు. ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయసేవాధికార సంస్థ వారిని సంప్రదిచాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, డాక్టర్ శ్రీవిష్ణు, జైలు విజిటింగ్ న్యాయవాది ఆనంద్, ఎల్ఎస్‌యూసీ మెంబర్ నవీన్‌రెడ్డి, ప్రత్యేక కారాగార సూపరింటెండెంట్ డాక్టర్.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్ర దాడి అమానుషం



ఎమ్మిగనూరులో ఉగ్రదాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణుల క్యాండిల్ ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేసి అమాయకుల ప్రాణాలను తీయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ వీరశైవ లింగాయర్ రాష్ట్ర అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప అన్నారు. పర్యాటకులపై ఉగ్రదాడికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు క్యాండిల్లతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరు ఖండిస్తున్నారన్నారు. ఉగ్రవాదులను పట్టుకొని తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఖాశింబేగ్, బజారి, డిష్‌కేశవరెడ్డి, నీలకంఠ, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బీఎస్ నాగరాజు, నాయకులు మురళీనాయుడు, కోటకొండ నరసింహులు, కె.విశ్వనాథ్, యూయూ నాగేష్, పాలశ్రీనివాసరెడ్డి, సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు.



ఆదోనిలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఆదోని రూరల్: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు నిరసన తెలియజేశారు. అమాయ ప్రజలను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారని, వెంటనే వారిని శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, న్యాయవాదులు తబ్రేజ్, లతీఫ్, ఆనంద్, అనితాబాయి, దేవరాజు, రవీంద్ర, ఈరన్న, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశ్వర రెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం

కోసిగి: మేజర్ పంచాయతీ కోసిగి ఈఓగా పనిచేస్తున్న తిరుమలేశ్వర రెడ్డికి ఉత్తమ సేవాపురస్కారం దక్కింది. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఆయనకు కోసిగి గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, నాయకులు మాణిక్యరాజు, రాజేష్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రంగస్వామి, బిల్ కలెక్టర్లు, పంచాయతీ కార్మికులు, సిబ్బంది, ప్రజలు అభినందనలు తెలిపారు.



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తిరుమలేశ్వర రెడ్డి